ప్రజల ఆశ, శ్వాస బీఆర్ఎస్సే

మీ ఆశీర్వాదమే నాకు కొండంత అండ
నా రాజకీయ జీవితం ప్రజాసేవకే..
నేటి రోడ్ షోను జయప్రదం చేయండి
మహబూబాబాద్ బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి మాలోతు కవిత

మాట్లాడుతున్న పార్లమెంట్ అభ్యర్థి మాలోతు కవిత

సమావేశానికి హాజరైన నాయకులు,కర్యాకర్తలు

ఇల్లెందు రూరల్, ఏప్రిల్ 30: ప్రజల ఆశ, శ్వాస బీఆర్ఎస్సే అని మహబూబాబాద్ పార్లమెంట్ బీఆర్ ఎస్ అభ్యర్థి మాలోతు కవిత అన్నారు. మంగళవారం మండలంలోని కరెంట్ ఆఫీస్ వద్ద బాలాజీ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ముఖ్య కార్యాకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో ప్రజల గుండెచప్పుడు నుంచి పుట్టిన పార్టీ బీఆర్ఎస్ అన్నారు. నాటి నుంచి నేటి వరకు పార్టీ ప్రజా సంక్షేమం గురించే పని చేస్తుందన్నారు. ఉద్యమ రథ సారిథి కేసీఆర్ తెలంగాణ ఉద్యమాన్ని అన్ని వర్గాల ప్రజల గుండెల్లో రగిలించి తెలంగాణ జన వాణి,సత్తాను నాడు కేంద్రలో ఉన్న కాంగ్రెస్ ప్రభు త్వానికి రుచి చూపించారన్నారు. తన రాజకీయ జీవితం మొత్తం ప్రజాసేవకే అంకితం చేశానని, జీవితం ఉన్నంతకాలం ప్రజల సంక్షేమం గురించే పని చేస్తానన్నారు.మరోసారి ఎంపీగా సేవ చేసుకునేందుకు అవకాశం కల్పించాలని కోరారు.

ఎంపీగా మాలోతు కవిత గెలుపు ఖాయం

మహబూబాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి మాలోత్ గెలుపు ఖాయమని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియా నాయక్ అన్నారు. నిరంతరం ఆమె ప్రజల సంక్షేమాన్ని గురించి ఆలోచించే నాయకురాలు అన్నారు.

రోడ్ షోకు జన సమీకరణ

మహబూబాబాద్‌లో మాజీ సీఎం తెలంగాణ ఉద్యమ రథసారథి కేసీఆర్ రోడ్ షోకు ఇల్లెందు మండలం నుంచి 5వేల మంది కార్యకర్తలను సమీకరణ చేస్తున్నామని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దండిగాల రాజేందర్ అన్నారు. కేసీఆర్ చేపడుతున్న రోడ్ షోకు ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి తమ మద్దతును తెలపాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ తక్కెళ్ల పల్లి రవీందర్, నాయకులు రంగనాథ్, పరుచూరి వెంకటేశ్వర్లు, శీలం రమేశ్, రేణుక, జేకే శ్రీను, అజాం, పద్మావతి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రి రామయ్యకు నిత్య కల్యాణం

రామయ్యకు కల్యాణం జరిపిస్తున్న అర్చకుడు

భద్రాచలం, ఏప్రిల్ 30: భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానంలో మంగళవారం సీతారాములకు అర్చకులు నిత్య కల్యాణాన్ని జరిపారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాతం పలికి ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్య హోమాలు, నిత్య బలిహరణం తదితర నిత్య పూజలు జరిపారు. అనంతరం స్వామివారి నిత్య కల్యాణ మూర్తులను బేడా మండపానికి తీసుకొచ్చి సంప్రదాయబద్ధంగా కల్యాణం నిర్వహించారు.

కేసీఆర్ రోడ్‌షోకు తరలిన టీబీజీకేఎస్ నాయకులు

మణుగూరు టౌన్: తరలివెళ్తున్న మణుగూరు ఏరియా టీబీజీకేఎస్ నాయకులు

సారపాక: రోడ్ షోకు వెళ్తున్న జడ్పీటీసీ, నేతలు

అశ్వాపురం: కేసీఆర్ రోడ్‌షోకు కదిలిన గులాబీ నేతలు

భద్రాచలం: రోడ్ షోకు వెళ్తున్న నాయకులు

మణుగూరుటౌన్, ఏప్రిల్ 30: బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కొత్తగూడెంలో మంగళవారం జరిగిన రోడ్‌షోకు మణుగూరు ఏరియా టీబీజీకేఎస్ నాయకులు మంగళవారం తరలివెళ్లారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ నాయకులు నాగెళ్లి వెంకటేశ్వర్లు, బంగారి పవన్‌కుమార్, పద్దం శ్రీనివాస్, గూగులోత్ రమేష్, సమర్పన్, దాసుమల్ల, ప్రవీణ్‌కుమార్, యెర్రపు వినయ్‌కుమార్, మునిగెల నాగేశ్వరరావు, రాంబాబు, రేవంత్ తదితరులు ఉన్నారు.

కేసీఆర్ రోడ్‌షోకు తరలిన బీఆర్ఎస్ నేతలు

సారపాక, ఏప్రిల్ 30: పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు విజయం కోసం కొత్తగూడెంలో మంగళవారం చేపట్టిన కేసీఆర్ రోడ్‌షోకు బూర్గంపహాడ్ జడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివెళ్లారు.

కేసీఆర్ రోడ్‌షోకు తరలిన గులాబీ శ్రేణులు

అశ్వాపురం, ఏప్రిల్ 30: మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా మంగళవారం కొత్తగూడెంలో చేపట్టిన రోడ్‌షోకు అశ్వాపురం మండల వ్యాప్తంగా పలు గ్రామాల నుంచి అధిక సంఖ్యలో గులాబీ సైన్యం తరలి వెళ్లారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కోడి అమరేందర్, కార్యదర్శి మర్రి మల్లారెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ రోడ్ షోకు వెళ్లిన బీఆర్ఎస్ శ్రేణులు

భద్రాచలం, ఏప్రిల్ 30: పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు విజయం కోసం కొత్తగూడెంలో మంగళవారం చేపట్టిన కేసీఆర్ రోడ్‌షోకు భద్రాచలం నుంచి నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు రావులపల్లి రాంప్రసాద్, మానె రామకృష్ణ నాయకత్వంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.

జిల్లా వైద్యారోగ్య శాఖకు అభినందన

కొత్తగూడెం టౌన్, ఏప్రిల్ 30: డీఎంహెచ్‌వో డాక్టర్ శిరీషను, ఎంసీహెచ్ పీవో చైతన్యను రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అభినందించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల డీఎంహెచ్‌లతో హైదరాబాద్‌లోని డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కార్యాలయంలో సమావేశం జరిగింది. మార్చి నెలలో వైద్య ఆరోగ్య శాఖ సాధించిన ప్రగతి, హెల్త్ ఇండికేటర్స్‌ను సమీక్షించింది. ఈ విషయంలో భద్రాద్రి కొత్తగూడెం మొదటి స్థానం సాధించిన సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ శిరీషను, ఎంసీహెచ్ పీవో చైతన్యను రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అభినందించారు.

రూ.26.81లక్షల ఆడిట్ అభ్యంతరాల రద్దు

భద్రాచలం, ఏప్రిల్ 30: భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానానికి సంబంధించి 2021-22 ఆడిట్ అభ్యంతరాల 1088పేరాలకు గానూ రూ.91,07,24,754లకు ఉన్నాయని, అందులోని 51పేరాలకు గానూ రూ. 26.81లక్షలు ఆడిట్ అభ్యంతరాలు ఉండగా జిల్లా ఆడిట్ విభాగం వారు వాటిని పరిశీలించి రద్దు చేయడం జరిగిందని దేవస్థానం ఈవో ఎల్ రమాదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆడిట్ విభాగం వారు అభ్యంతరాలను రద్దు చేసేందుకు సహకరించిన స్టేట్ ఆడిట్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ ఎం వెంకటేశ్వరరావు, డీఏవో బీ రాజు, సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఈవో పేర్కొన్నారు.

విశ్రాంత పోలీస్ అధికారులకు సత్కారం

విశ్రాంత పోలీస్ అధికారులను సన్మానిస్తున్న ఎస్పీ రోహిత్ రాజు

కొత్తగూడెం క్రైం, ఏప్రిల్ 30: ఉద్యోగ విరమణ చేసిన పోలీస్ అధికారులను ఎస్పీ బిరుద రాజు రోహిత్ రాజు మంగళవారం తన కార్యాలయంలో సత్కరించారు. పీసీఆర్ ఎస్సై బి.శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచ్ ఏఎస్సై పి.వసంతరావు, భద్రాచలం టౌన్ ఏఎస్సై బి.నర్సింహారావు, బూర్గంపాడు ఏఎస్సై వైవివి.సత్యనారాయణ ఉద్యోగ విరమణ చేశారు. వారి శేష జీవితం ప్రశాంతంగా, సుఖప్రదంగా సాగాలని ఆకాంక్షించారు. అదనపు ఎస్పీ (ఆపరేషన్స్) టి.సాయి మనోహర్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, వెల్ఫేర్ ఆర్ఐ కృష్ణారావు, జిల్లా పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు సూరిశెట్టి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు ఏసోబు, పీఆర్‌వో దాములూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా శిక్షణా సంస్థలో ప్రవేశానికి ఆహ్వానం

కొత్తగూడెం ఎడ్యుకేషన్, ఏప్రిల్ 30: దుర్గాబాయి దేశ్‌ముఖ్ ప్రభుత్వ మహిళా సాంకేతిక శిక్షణా సంస్థ(పాలిటెక్నిక్)లో డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ శాఖాధికారి విజేత ఒక ప్రకటనలో తెలిపారు. తల్లిని/తండ్రిని, ఇద్దరినీ కోల్పోయిన నిరుపేద బాలికలు మాత్రమే దరఖాస్తు చేసేందుకు అర్హులని పేర్కొన్నారు. మే 17వ తేదీలోపు కలెక్టరేట్‌లోని జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించవచ్చని పేర్కొన్నారు.

యువకుడి ఆత్మహత్య

పాల్వంచ రూరల్, ఏప్రిల్ 30: మండలంలోని చిరుతానిపాడు గ్రామ యువకుడు పద్దం ఉంగయ్య(24) చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు... ఇతడు ఈ నెల 26న, బంజర(ఉల్వనూరు)లోని తన అత్తారింటికి వెళ్తున్నట్లుగా ఇంట్లో చెప్పి బయల్దేరాడు. కానీ, అతడు అక్కడకు వెళ్లలేదన్న విషయం రెండు రోజుల తరువాత తండ్రి భీమయ్యకు తెలిసింది. అతడు బంధుమిత్రుల వద్ద ఆరా తీసినా జాడ తెలియలేదు. ఈ నెల 29న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గ్రామ శివారులోని చెట్టుకు ఉరి వేసుకున్న స్థితిలో ఉంగయ్య కనిపించడంతో అతడి తండ్రి భీమయ్యకు గ్రామస్తులు సమాచారమిచ్చారు. ఆయన ఫిర్యాదుతో రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం పట్టివేత

చర్ల, ఏప్రిల్ 30: వ్యానులో తరలిస్తున్న అక్రమ మద్యాన్ని ఎక్సైజ్ పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై సీతారామరాజు తెలిపిన వివరాల ప్రకారం పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని గుంపెనగూడెం గ్రామంలో ఎక్సైజ్ పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా అక్రమంగా ఆటోలో తరలిస్తున్న మద్యాన్ని పట్టుకుని, ఆటోను స్వాధీనం చేసుకుని భద్రాచలం ఎక్సైజ్ కార్యాలయానికి తరలించామని ఎస్సై తెలిపారు.

సింగరేణి విశ్రాంత అధికారులకు సన్మానం

కొత్తగూడెం సింగరేణి, ఏప్రిల్ 30: సింగరేణి పర్సనల్ (వెల్ఫేర్, ఆర్‌సీ) విభాగం జనరల్ మేనేజర్ కె.బసవయ్య మంగళవారం ఉద్యోగ విరమణ చేశారు.ఆయనను యాజమాన్యం, పర్సనల్ విభాగం అధికారులు సన్మానించి జ్ఞాపిక అందజేశారు.

ఎస్ఎస్‌వో సూర్యనారాయణకు..

రామవరం, ఏప్రిల్ 30: సింగరేణి ఎస్అండ్‌పీసీ విభాగం సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్(ఎస్ఎస్‌వో) సూర్యనారాయణ మంగళవారం ఉద్యోగ విరమణ చేశారు. ఆయనను సెక్యూరిటీ గార్డులు, డిపార్ట్‌మెంట్ అధికారులు సన్మానించారు.

ప్రణాళికాబద్ధంగా ఉత్పత్తి కొనసాగించాలి

సింగరేణి డైరెక్టర్(ఈఅండ్ఎం) డీ సత్యనారాయణరావు

ఉత్పత్తిని పరిశీలిస్తున్న డైరెక్టర్(ఈఅండ్ఎం)

మణుగూరుటౌన్, ఏప్రిల్ 30: రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని క్వారీల్లో వరదనీటి ప్రవాహం వల్ల బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలగకుండా ప్రణాళికా బద్ధంగా బొగ్గు ఉత్పత్తి ప్రక్రియ కొనసాగించాలని సింగరేణి డైరెక్టర్ (ఈఅండ్ఎం) డీ సత్యనారాయణరావు అన్నారు. మంగళవారం మణుగూరు ఏరియాలో పర్యటించి కేసీహెచ్‌పీ, ఓసీ-4 గనులను ఏరియా జీఎం దుర్గం రామచందర్, సంబంధిత అధికారులతో కలిసి సందర్శించారు. వ్యూ పాయింట్ ద్వారా బొగ్గు ఉత్పత్తి ప్రక్రియ, ఓబీ వెలికితీత పనులను పరిశీలించారు. అనంతరం జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో అధికారులతో మాట్లాడారు. నిర్ధేశిత లక్ష్యాల సాధనకు గాను భారీ యంత్రాల పనిగంటలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని అన్నారు. ఎండ తీవ్రత వల్ల కార్మికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వైద్యపరమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బొగ్గు రవాణాలో ఎలాంటి ఆటంకాలు ఏర్పడకుండా సంబంధిత యంత్రాలను అనునిత్యం పరిశీలించాలని, బ్రేక్‌డౌన్‌కు అవకాశం ఉన్న లోపాలను కనిపెట్టి సత్వర మరమ్మత్తులకు చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. బొగ్గు సరఫరా నిర్ణీత సమయంలో జరిగేలా అధికారులు అనునిత్యం పర్యవేక్షిస్తూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా స్టోర్ ఇన్వెంటరీ మెటీరియల్ తక్కువగా ఉండేలా చూసుకోవాలని, అవసరమైన మేరకు మాత్రమే మెటీరియల్ సమకూర్చుకొని సంబంధిత గనులు, డిపార్టుమెంట్లకు పంపాలని అన్నారు. సమావేశంలో ఎస్వోటూ డైరెక్టర్(ఈఅండ్ఎం) కేవీరావు, పీకేఓసీ పీవో లక్ష్మీపతిగౌడ్, ఎంఎన్‌జీ ఓసీ పీవో శ్రీనివాసచారి, ఏజీఎం(ఈఅండ్ఎం) నర్సిరెడ్డి, డీజీఎం(పర్సనల్) రమేష్, ప్రాజెక్టు ఇంజినీర్లు వీరభద్రుడు, రవీందర్, మేనేజర్(ఆపరేషన్స్) శ్రీనివాస్, సీనియర్ సెక్యూరిటీ అధికారి షబ్బీరుద్దీన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

అశ్వాపురం, ఏప్రిల్ 30: త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా ఓటుహక్కును వినియోగించుకోవాలని డీఎస్పీ రవీందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం అశ్వాపురం పోలీసులు ఓటుహక్కు ప్రాధాన్యతను వివరిస్తూ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. పోలీసు స్టేషన్ నుంచి ప్రధాన రహదారి వెంట కేంద్ర సాయుధ బలగాలతో కలిసి ఫ్లాగ్ మార్చ్ చేపట్టారు. కార్యక్రమంలో అశ్వాపురం, ఏడూళ్లబయ్యారం, మణుగూరు సీఐలు అశోక్‌రెడ్డి, కరుణాకర్, సతీశ్‌కుమార్, ఎస్సైలు సురేశ్, తిరుపతిరావు, వెంకటప్పయ్య, రాజేందర్, సీఆర్‌పీఎఫ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అశ్వారావుపేట, ఏప్రిల్ 30: పార్లమెంట్ ఎన్నికల్లో అందరూ ధైర్యంగా, ప్రశాంతంగా ఓటు వేయాలని పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్ కోరారు. పట్టణంలో మంగళవారం పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఓటు వేయడం ద్వారా సమర్థ పాలకులను ఎన్నుకోవాలన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి ఆర్టీసీ బస్టాండ్, పొట్టి శ్రీరాములు సెంటర్, గాంధీ బొమ్మ సెంటర్, భగత్‌సింగ్ సెంటర్ మీదుగా రింగ్ రోడ్డు వరకు ఫ్లాగ్ మార్చ్ సాగింది. సీఐ జితేందర్‌రెడ్డి, ఎస్సైలు శ్రీరాముల శ్రీను, శివరామకృష్ణ, సాయికిషోర్‌రెడ్డి, రాజమౌళి, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఈ లడ్డూలు ఎక్కడివి?

భద్రాద్రి దేవస్థానం అన్నదాన సత్రం వెనుక స్వామివారి లడ్డూ ప్రసాదాలు
కల్యాణం నాటివంటూ ప్రచారాలు.. పట్టుబడిన నకిలీలంటూ వివరణలు

అన్నదాన సత్రం వెనక పారబోసిన లడ్డూలు

భద్రాచలం, ఏప్రిల్ 30: భద్రాచలం సీతారామచంద్రస్వామివారి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత అన్నదాన సత్రం వెనుక మంగళవారం ఉదయం లడ్డూలు కన్పించాయి. అవి స్వామివారి కల్యాణం కోసం తయారు చేసిన లడ్డూలంటూ, అనుకున్న రీతిలో భక్తులు రాకపోవడంతో మిగిలిన లడ్డూలను దేవస్థానం అధికారులు అక్కడి చెత్త కుప్పలో పడవేశారంటూ సోషల్ మీడియాలో కథనాలు హల్‌చల్ చేశాయి. అయితే, స్వామివారి కల్యాణ సమయంలో భక్తులు అధికంగా వచ్చి స్వామివారి ప్రసాదాలు కొనుగోలు చేస్తుంటారు. ఇదే అదనుగా భావించి రామాలయ పరిసర ప్రాంతాల్లోని వ్యాపారులు లడ్డూలను తయారు చేసి వాటిని అమాయకపు భక్తులకు విక్రయిస్తుంటారు. ఈ విషయంపై దృష్టి సారించిన దేవస్థానం ఈవో.. కొంత మంది నకిలీ లడ్డూ తయారీదారులను గమనిస్తూ ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. అయితే కల్యాణం సమయంలో కొంతమంది వద్ద అమ్మకానికి సిద్ధంగా ఉన్న లడ్డూలను దేవస్థానం అధికారులు గుర్తించి స్వాధీనం చేసుకొని స్టాక్ రూంలో ఉంచారు. తాజాగా సోమవారం రాత్రి వాటిని అన్నదాన సత్రం వెనుక పారబోశారు. అయితే, కొందరు వ్యక్తులు వీటిపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేశారు. అయితే గతంలోనూ ఒకసారి ఇలా స్వామివారి లడ్డూలను బయట పారబోసిన ఘటన చోటుచేసుకొని ఉండడంతో ఈ సారి కూడా అలాగే జరిగిందేమోననుకొని భక్తులు అయోమయానికి గురయ్యారు. కాగా, ఈ విషయంపై దేవస్థానం ఈవో రమాదేవిని వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులో లేరు. దేవస్థానం ఈఈ రవీందర్ రాజును వివరణ కోరగా.. వ్యాపారుల వద్ద పట్టుకున్న నకిలీ లడ్డూలని బయోగ్యాస్ కోసం వినియోగించేందుకు అన్నదాన సత్రం వెనుక వేసినట్లు సమాధానమిచ్చారు.